ప్రైవేటు వ్యాపారులే దిక్కా !

- గ్రామాల్లో ఏర్పాటు కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముకుంటున్న రైతులు
- మద్దతు ధర లభించడం లేదని ఆందోళన


మిల్లర్లకు అమ్మేందుకు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకెళ్తున్న రైతులు

మునుగోడు : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు తమ ధాన్యం అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాక ధాన్యం అమ్ముకోవాలని వేచి చూస్తుండగా మరి కొంతమంది రైతులు మద్దతు ధర కంటే తక్కువ నగదు చెల్లిస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

10,900 ఎకరాల్లో వరి సాగు

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో దాదాపు 5 వేల మంది రైతులు 10,900 ఎకరాల్లో వానాకాలం సీజన్‌లో వరి సాగు చేశారు. పంట చేతికి రావడంతో మిషన్లతో వరి కోతలు మొదలుపెట్టారు. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో రైతన్నలు అనుకున్న స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఒక వేళ ఎకరానికి 40 బస్తాల దిగుబడి వస్తే సగటున 26 క్వింటాళ్ల చొప్పున మండలవ్యాప్తంగా 4,99,200 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

నేటికీ ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

వరి కోతలు మొదలై దాదాపు వారం, పది రోజులవుతున్నా నేటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో కొందరు రైతులు స్థానిక మిల్లుల్లో తమ ధాన్యం అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న మిల్లు యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2180 చెల్లించకుండా క్వింటాలుకు రూ.1700 నుంచి రూ.1800 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. కొందరు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తర్వాతనే ధాన్యం అమ్ముకోవాలని తమ కల్లాల వద్ద నిల్వ చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని రైతు సంఘాల నాయకులు, రైతులు కోరుతున్నారు.

పొలం వద్ద ధాన్యం నిల్వ ఉంచా



నాకున్న రెండెకరాల తరి పొలంలో వరి సాగు చేశా. అది చేతికి రావడంతో మిషన్‌తో కోయించా. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయపోవడంతో పొలం వద్ద ధాన్యం నిల్వ ఉంచా. బయట మిల్లులో అమ్ముకుంటే క్వింటాళ్లు రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే బాగుండు.

–యంపల్ల వెంకన్న, రైతు, సింగారం

ఐదు కేంద్రాలు ప్రారంభిస్తాం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మిల్లుల ట్యాగింగ్ చేసి గోనె సంచులు సరఫరా చేసిన వెంటనే పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఐదు కేంద్రాలను ప్రారంభిస్తాం. మిల్లులను ట్యాగ్ చేయని కారణంగా కేంద్రాలను ప్రారంభించలేదు.

–సుఖేందర్, పీఏసీఎస్ సీఈఓ

బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలి

కట్టంగూర్ : బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో చిట్యాలలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీరెల్లి రాజ్యలక్ష్మిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో సల్ల రాజు, నర్సింగు యాదగిరి, శ్రీను, సురేష్, మల్లయ్య, ఎల్లయ్య, వీరేష్, కుంచం అశోక్, రాజు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నల్లగొండ కాంగ్రెస్ ఎంపీపీ

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ కాంగ్రెస్ ఎంపీపీ మనిమద్దె సుమన్ ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. భూపాల్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సుమన్‌ను మంత్రి కేటీఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల కృష్ణారెడ్డి, మారగోని గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు

చిట్యాల : కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు చిట్యాల మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు పలువురు యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చిట్యాల మున్సిపాలిటీ పదకొండో వార్డు కౌన్సిలర్ గోధుమగడ్డ పద్మ జలంధర్‌రెడ్డి, ఐదో వార్డు కౌన్సిలర్ జమాండ్ల జయమ్మ శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాటి రమేష్‌రెడ్డి, చెరకు సాయిరాం, కందాటి సత్తిరెడ్డి, పబ్బు జగదీష్‌గౌడ్, జన్నపాల నరేష్, రావుల మల్లేష్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు చెరుకు బాలకృష్ణ, రావుల రాంరెడ్డితోపాటుగా మరికొందరు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ టూటౌన్ : నల్లగొండ ఎంపీపీ సుమన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

నకిరేకల్ : సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ మేనిఫెస్టో విడుదల చేయడంతో నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించి మెయిన్ సెంటర్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్య గెలవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించడంతో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆదివారం కట్టంగూర్‌లో బాణ సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, పెద్ది బాల నర్సింహ, అంతటి శ్రీను, యాదయ్య, వెంకన్న, కన్నయ్య, నాగేష్ , అంజయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ మేనిఫెస్టో ప్రకటించడంతో మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు విజయారాణి తదితరులు పాల్గొన్నారు.


కేతేపల్లి : కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్కట్‌పల్లి : సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన అనంతరం ఆదివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని నల్లగొండ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక పావని శ్రీధర్, సర్పంచ్‌లు కర్నాటి ఉపేందర్, యాణాల మాధవిఅశోక్‌రెడ్డి, గోసుల భద్రాచలం, మల్గ బాలకృష్ణ, కొత్త నర్సింహ, దోసపాటి విష్ణుమూర్తి, ప్రజ్ఞాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

నార్కట్‌పల్లి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నార్కట్‌పల్లి మండలంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చెర్వుగట్టు, నార్కట్‌పల్లి, మాధవ ఎడవల్లి, బి.వెల్లెంల గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నార్కట్‌పల్లిలోని 13వ వార్డులో దుర్గామాత విగ్రహం వద్ద ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అర్చకులు భగవాన్‌శర్మ, వెంకన్న ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ ముత్యాలు, ఉత్సవ కమిటీ సభ్యులు మట్టిపల్లి శ్రీనివాస్, పసునూరి శ్రీను, దాచేపల్లి రవి, దోసపాటి రఘు, రాములు, ప్రజ్ఞాపురం రాములు, వాసుదేవ్, వడ్డెగోని రామలింగయ్య, రాధారపు భిక్షం, రాచకొండ నర్సింహాచారి పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయ అధ్యక్షుడు అవ్వారు శ్రీనివాస్ ప్రణవ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇడెం రోజా, జెల్ల షణ్ముఖీ, మాజీ సర్పంచ్ నామని జగన్నాథం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గామాత శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, కలశ స్థాపన, స్వస్తివాచనం, మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, చైర్మన్ శీలా సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు. అదేవిధంగా చిట్యాల పట్టణంలోని ఐదో వార్డు సంతోషనగర్‌లో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో, పదో వార్డు ముత్యాలమ్మగూడెంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయా సంఘాల అధ్యక్షులు కంభంపాటి సతీష్, బెల్లం నవీన్, తీగల శివ, గండూరి రామకృష్ణ, బోయ సురేష్ పాల్గొన్నారు.


కట్టంగూర్ : మండలంలోని ఈదులూరు, అయిటిపాముల, కట్టంగూర్, పరడ, ముత్యాలమ్మగూడెం తోపాటు పలు గ్రామాల్లో భక్తులు ఆదివారం దుర్గామాత విగ్రహాలను నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రామడుగు శ్రీనివాస శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రుద్రాబట్ల జితేంద్ర శర్మ, కోమటి భాస్కర్,పారిజాత, రెడ్డిపల్లి సైదులు,సైదమ్మ, స్వరూప, కొంపెల్లి మంగమ్మ, గోపి, శ్రీరామ్ పాల్గొన్నారు.

నాంపల్లి : దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో పూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ : శివరాం నగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు


కట్టంగూర్ : పూజలు చేస్తున్న భక్తులు


నార్కట్‌పల్లి : పూజలో పాల్గొన్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి, తదితరులు

కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకుంటా


నార్కట్‌పల్లి : వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న చెర్వుగట్టు ఆలయ మాజీ డైరెక్టర్లు

నకిరేకల్ : కొత్త, పాత తేడా లేకుండా నకిరేకల్ నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలందరినీ కాపాడుకుంటానని కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనందరి లక్ష్యం నకిరేకల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే అన్నారు. ఈ సందర్భంగా ఓగోడు గ్రామం నుంచి పలువురి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశంలో నకిరేకల్ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, నూకల రఘునందన్‌రెడ్డి, గాజుల సుకన్య, గాదగోని కొండయ్య, వీరార్జున్‌రెడ్డి, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

చిట్యాల : మండలంలోని కాంగ్రెస్ పార్టీ పాత, కొత్త నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గోపగోని నర్సింహ, గోపగోని లింగస్వామి, బుస్సు శ్రీనివాస్, చెరుకు స్వామి, రెడపాక రాములుతోపాటు మరో వందమంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుబ్బ పద్మకుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బండ గిరిజ అంజయ్య, బండ కృష్ణయ్య, నాయకులు పంతంగి రంగారావు, దోర్నాల రామచంద్రం , బండ లింగస్వామి, అన్నెబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామానికి చెందిన పలువురు గౌడ కులస్తులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుత్తా మాధవరెడ్డి, భీమారం మాజీ సర్పంచ్ నరేందర్‌యాదవ్, బొజ్జ సుందర్, జెంజారపు చంద్రశేఖర్ గౌడ్, కోట శ్రీనివాస్, నోముల రామకృష్ణ, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన చెర్వుగట్టు ఆలయ మాజీ డైరెక్టర్లు రాధారపు భిక్షపతి, రాధారపు విజయలక్ష్మి, దోసపాటి ప్రసాద్, ప్రజ్ఞాపురం రాములు, రాచకొండ నర్సింహాచారితోపాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల భరత్, మట్టిపల్లి శ్రీను, జేనిగ కనకయ్య పాల్గొన్నారు.

తుమ్మల, పొంగులేటికి ఘన స్వాగతం

నకిరేకల్ : హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద కొద్దిసేపు ఆగారు. వారికి నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిరేకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వేముల వీరేశాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ, గాజుల సుకన్య, యానాల లింగారెడ్డి, కొండా వెంకన్న ఉన్నారు.


స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలకు అండగా ఉంటా

కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉండి, కంటికి రెప్పలా కాపాడుకుంటానని కాంగ్రెస్ నేత దైద రవీందర్ అన్నారు. కేతేపల్లి మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు పదవి వచ్చినా రాకున్నా ప్రజల మధ్యే ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టె అంతయ్య, నాయకులు భద్రమ్మ, వీరమ్మ, లలిత, జోజి, మంగమ్మ, రాములు, పద్మ, బాలశౌరి, బక్కయ్య, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో కోలాటం ఆడే మహిళలు 25 మందికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అంతటి పారిజాత నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, నాయకులు కొంపెల్లి వెంకట్‌రెడ్డి, చీమల వీరేశం, అంతటి శోభావెంకటేష్, చిరగోని శ్రీశైలం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల నగదు, మద్యం పట్టివేత


మునుగోడు : పట్టుబడిన మద్యం చూపిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాల్లో గల బెల్టు దుకాణాల్లో రూ.73వేల విలువ గల మద్యం బాటిళ్లను మునుగోడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండల పరిధిలోని పులిపలుపుల, ఊకొండి, గూడపూర్ తదితర గ్రామాల్లో గల బెల్టు దుకాణాలపై ఆదివారం పోలీసు సిబ్బంది దాడులు చేయగా 148 లీటర్ల మద్యం పట్టుబడిందని తెలిపారు. మద్యం సీజ్ చేసి, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం అమ్ముతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

చండూరు : చండూరు నుంచి కనగల్ మండలం జియడవెల్లి గ్రామానికి వెళ్తున్న శేఖర్ అనే వ్యక్తి నుంచి ఉడతలపల్లి గ్రామంలో పోలీసులు రూ.54,500 స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కనగల్ మండలం శాబ్దుల్లాపూర్‌కు చెందిన కేశవులు వద్ద రూ.1,06,500 నగదు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

నాంపల్లిలో..

నాంపల్లి : తనిఖీల్లో భాగంగా నాంపల్లి మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం యాదయ్య బెల్ట్ దుకాణంలో ఆరు వేల రూపాయల విలువగల మద్యం పట్టుకున్నారు. మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

రూ. 60 వేల నగదు స్వాధీనం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ ఎన్.ధర్మా నేతృత్వంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మిర్యాలగూడ హనుమాన్‌పేటకు చెందిన ఎం.పకీరయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా నల్లగొండకు హోండా యాక్టివాలో తరలిస్తున్న రూ. 60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును నల్లగొండ ట్రెజరీలో అప్పజెప్పామని ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

మునుగోడు టికెట్ ముదిరాజ్‌లకు ఇవ్వాలి


మాట్లాడుతున్న నారబోయిన రవి

చండూరు : మునుగోడు నియోజకవర్గంలో 33,500 ముదిరాజ్ కులస్తుల ఓట్లు ఉన్నాయని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ను ముదిరాజ్‌లకే ఇవ్వాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నారబోయిన రవి అన్నారు. చండూరులో ఆదివారం ముదిరాజ్ ఆత్మ గౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలో వందమంది ఎమ్మెల్యేలు, 14 మంది మంత్రులు ప్రచారం చేస్తే కేవలం పది వేల ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచారని, తిరిగి అదే వ్యక్తిని మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని అన్నారు. బీఆర్‌ఎస్ అధిష్టానం ఇకనైనా పునరాలోచించి బీసీ బిడ్డగా తనకు అవకాశం ఇవ్వాలన్నారు. సినీ, టీవీ నటుడు బిత్తిరి సత్తి (రవికుమార్) మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంతో గెలిచే అభ్యర్థి నారబోయిన రవికే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలన్నారు. ముందుగా చండూరు నుంచి అంగడిపేటకు ర్యాలీ నిర్వహించారు. ఈటెల వెంకటేశ్వర్లు, కుశవ శంకర్, వెలుగు వెంకటేశ్వర్లు, ప్రేమలత, కావలి యాదగిరి, గండూరి జనార్దన్, ఓంకారం, రమణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కట్టంగూర్ హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రంగారెడ్డి, లింగారెడ్డి, పద్మజ, లతాకుమారి, పూర్వ విద్యార్థులు గట్టిగొర్ల గంగరాజు, జానయ్య, తిరుమలేష్, ఉపేందర్, బొడ్డుపల్లి సైదులు ఉన్నారు.


కట్టంగూర్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కనగల్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు దర్వేశిపురంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువు నేర్పిన గురువులను సన్మానించారు.


కనగల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కట్టంగూర్ : నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వేముల వీరేశంను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో ఆదివారం కట్టంగూర్‌లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐతగోని నర్సింహ, గద్దపాటి దానయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, రామకృష్ణ, గుండు శేఖర్, కాపుగొంటి గోపి, నమ్ముల యాదయ్య, కానుగు శ్రీను, పొడిచేటి శ్రీకాంత్, మద్దెల గణేశ్, గుండు వెంకన్న పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

నియామక పత్రం అందజేత

చండూరు : బహుజన సమాజ్ పార్టీ చండూర్ మండల ప్రధాన కార్యదర్శిగా దోనిపాముల గ్రామానికి చెందిన చిలకరాజు శివజేమ్స్ నియమితులయ్యారు. ఆదివారం శివజేమ్స్‌కు చండూరులో బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆందోజు శంకరాచారి నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ అధ్యక్షుడు గండు నాగేంద్రబాబు, చండూరు మండలం అధ్యక్షుడు నేరెళ్ల ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల సాధన సమితి కార్యవర్గం ఎన్నిక

చిట్యాల : వెలిమినేడు మండల సాధన సమితి కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సమితి గౌరవ అధ్యక్షుడిగా దేశబోయిన నర్సింహ, అధ్యక్షుడిగా పోలగోని శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా అర్రూరి కలమ్మ, ప్రధాన కార్యదర్శిగా పబ్బు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా కూనురు గణేశ్, గోలి సాయికిరణ్‌లతో పాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిశోర్

నల్లగొండ : నల్లగొండ పట్టణ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 33వ వార్డుకు చెందిన పేర్ల కిశోర్ నియమితులయ్యారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పేర్ల కిశోర్‌కు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు నియామక పత్రాన్ని అందజేశారు. మామిడి కార్తీక్, చింత వంశీ, మనిమద్దె సాయిరాం, శ్రీధర్, హరిశంకర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజక అభ్యర్థులను గెలిపించుకోవాలి

నల్లగొండ టూటౌన్ : ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న రజక కులస్తులను గెలిపించుకోవాలని చాకలి ఐలమ్మ భవనం అధ్యక్షుడు ఆమంచి అంజయ్య కోరారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని రజక సంక్షేమ భవన్‌లో రజక సంఘాల సమన్వయ సమితి, ఐలమ్మ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో చిక్కుల రాములు, చిలకరాజు చెన్నయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, సత్తయ్య, నగేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కనగల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కరీం పాష ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి రావాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన దామెర అభిలాష్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఆర్‌ఐ కె.నవీన్‌రెడ్డి ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ వెంకటమ్మమధుకర్ ద్వారా రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అబ్దుల్ కలాంకు నివాళి

కనగల్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని కనగల్ మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద ప్రముఖ వైద్యురాలు, జనమైత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు కంబాల శివలీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సింగం రవి, కానుగు విజయలక్ష్మి, సింగం గిరి, పూర్ణచంద్రరెడ్డి, సింగం తేజస్విని, సాక్షి, గోపి, పావని పాల్గొన్నారు

హనుమాన్ శక్తి జాగరణ సమితి ఎన్నిక

మర్రిగూడ : హనుమాన్ శక్తి జాగరణ సమితి మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డి యాదయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జమ్ముల వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మోగావత్ గోపాల్, కోశాధికారిగా అంబాల రమేష్, సహాయ కార్యదర్శిగా ఉప్పు శివశంకర్, కార్యదర్శులుగా మెరుగు శ్రీనివాస్, రమావత్ రాజునాయక్, దండేట్కర్ శోభన్ బాబు, శేఖర్‌లతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, పల్లె సాయిలు, చంద్రశేఖర్, గోపాల్, చామకూర యాదగిరి, సురేందర్, మహేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కనగల్ : మండల పరిధిలోని ఇరుగంటిపల్లి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్లగొండ బ్రాంచ్ వారి సహకారంతో డిపార్ట్‌మెంట్ ఎన్‌పవర్‌మెంట్ పర్సన్స్ డిజెబిలిటీస్ అండ్ మొబైల్ మెడికేర్ యూనిట్(ఎంఎంయూ) ప్రాజెక్ట్ వారు వృద్ధులకు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 85 మంది వృద్ధులకు వివిధ పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, మందడి నర్సిరెడ్డి, డాక్టర్ పుల్లారావు, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాములు, డాక్టర్లు రాజేశ్వరి, పద్మ, ఉష, రామ్మోహన్, వంగూరి శ్రీనివాస్, అవని రెడ్ క్రాస్ ఎంసీ మెంబర్స్ ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి, సూరెడ్డి, సరస్వతి, సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు